డైలీ హెల్త్ డైరీ

# ఫైలేరియా తగ్గడానికి మందులేమిటి..?



## హోమియో...

నాకు 68ఏళ్లు. 1997లో నా కుడికాలికి ఫైలేరియా వచ్చింది. ఫ్లోరోసిడ్ ఇంజెక్షన్లు చేయించుకున్నాను, హెట్రోజిన్ మందులు వాడాను. ఇప్పటికీ వాపు తగ్గుతుంటుంది, వస్తుంటుంది. మూడు నెలల నుంచి ఆరు నెలలకోసారి జ్వరం వస్తుంది. అరికాళ్లల్లో కూడా నొప్పులు వస్తున్నాయి. ఇప్పటికీ మందులు వాడుతున్నాను. ఇలా ఎన్నాళ్లు వాడాలి. వాపు ఇక తగ్గదా? తెలియజేయండి.

– ఎస్.కె.మహ్మద్ ఇబ్రహీమ్, గుంటూరు

ఫైలేరియా వ్యాధి క్యూలెక్స్ దోమ కుట్టడం వల్ల వస్తుంది. అది అభివృద్ధి చెందే క్రమం పక్కనున్న చిత్రపటంలో చూడవచ్చు. దీనివల్ల వచ్చే నొప్పులకు, అప్పుడప్పుడు వచ్చే జ్వరానికి హోమియోలో మంచి మందులున్నాయి.

**ఆర్సనిక్:** కాళ్ళ వాపుతోపాటు నొప్పులు, నీరసించిపోవడం, వణుకుతోపాటు పిక్కలు బిగుసుకుపోవడం, మధుమేహంతో పాటు పుళ్లు పడటం, కాళ్ళు లాగుతున్నట్టు ఉండటం, సయాటికా నొప్పి, తిమ్మిర్లు, నీరసంతో కాళ్ళు పడిపోవడం. ఇటువంటి లక్షణాలు ఉన్నవారు ఈ మందును వాడవచ్చు.

**అబ్రటినమ్:** కాళ్ళు లాగడం, కీళ్ళ నొప్పులు, ప్రొటీన్‌ల లోపం వల్ల మెరానమస్ అనే వ్యాధితో కాళ్ళు, చేతులు నీరసించినప్పుడు ఈ మందును వాడవచ్చు. చిన్న పిల్లల్లో ఈ లక్షణాలు ఉంటే ఈ మందు బాగా పనిచేస్తుంది.

**అయోడమ్:** కాళ్ళ వాపులతో పాటు నొప్పులు, ముఖ్యంగా రాత్రి సమయంలో ఎక్కువగా ఉండటం, కాళ్ళల్లో లింఫ్స్ నిండుకోవడం వల్ల కాళ్ళు వాపుతోపాటు తెల్లగా కనబడతాయి. కాళ్ళు వాపుతో ఉన్నప్పటికీ కాళ్ళల్లో రక్తనాడులు కొట్టుకోవడం చేతి స్పర్శతో తెలుస్తుంది. పాదాలు, కాళ్ళు చెమటతో తడిచిపోతుంటాయి, వేడి శరీరం వారికి ఈ మందు బాగా పనిచేస్తుంది.

**లైకోపోడియం:** ముఖ్యంగా కుడి కాలికి మాత్రమే ఫైలేరియా వచ్చి కాలు వాపుతో పాటు వేడిగా కూడా ఉంటుంది. నొప్పి, తిమ్మిరులు ముఖ్యంగా కుడివైపుకు తిరిగి పడుకున్నప్పుడు ఎక్కువ అవుతాయి, కుడివైపుకు తిరిగి పడుకోలేరు. ఈ లక్షణాలు ఉన్నవారికి ఈ మందు సరిపడుతుంది.




మనిషికి బోదకాలు వ్యాధిని కలగజేసే ఉకరేరియా బ్యాంక్రాఫ్టి అనే పరాన్నజీవి లైఫ్‌సైకిల్

**సైలీసియా:** కాళ్ళ వాపుతోపాటు చల్లబడటం, పాదాల్లోను, కాళ్ళల్లోను చల్లని చెమట ఎక్కువగా పట్టడం, నీరసించి, పక్షవాతం వచ్చినట్లు కాళ్ళు పడిపోవడం, పిక్కలు బిగుసుకుపోవడం, చలి వల్ల సమస్యలు అధికమవ్వడం వంటి లక్షణాలకు ఈ మందు వాడొచ్చు.

ఫైలేరియాతో పాటు నెలకోసారి జ్వరం కూడా ఉండంటం వల్ల లైకోపోడియం 200 రోజుకు ఒక్క డోసు చొప్పున వారం రోజులు పాటు వాడాలి.

ఫైలేరియా వ్యాధి ద్వారా వచ్చే జ్వరం, నొప్పులు వాటికి హోమియో మందులు బాగా పనిచేస్తాయి కాని, వాపు తగ్గాలంటే కేవలం హోమియో మందులు సరిపోవు, ఇంగ్లీషు మందులు వాడాలి, యోగా చేస్తుండాలి.

నాకు 23ఏళ్లు. రెండేళ్ల క్రితం 95కిలోల బరువు ఉండేవాడ్ని. ఇప్పుడు 67కిలోలు ఉన్నాను. నాకు వీపు మీద గడ్డ వచ్చింది. మద్రాసులో దానికి ఆపరేషన్ చేయించినప్పుడు నాకు షుగర్ ఉంది అని తెలిసింది. నాకు పెళ్ళి నిశ్చయమైంది. ఆ అమ్మాయికి బి.పి ఉంది. మేమిద్దరం పెళ్ళి చేసుకుంటే ఆరోగ్యపరంగా ఏమైనా సమస్యలు వస్తాయా? మా తల్లి దండ్రులకు షుగర్ వ్యాధి ఉంది. పెళ్ళయితే నా భార్యకు, పుట్టబోయే పిల్లలకు కూడా వచ్చే అవకాశం ఉందా? ఇలా రాకుండా ఉండాలంటే ఏం చేయాలి? ఏమైనా మందులు వాడాలా తెలియజేయండి.

– రాస, శ్రీకాళహస్తి

మధుమేహంతో బాధపడుతున్న వ్యక్తి బి.పి ఉన్న అమ్మాయిని పెళ్ళి చేసుకుంటే ఎప్పటి వరకూ వారు తమ షుగర్ స్థాయిని, బి.పి.ని కంట్రోల్‌లో ఉంచుకుంటారో అంతవరకూ ఎటువంటి సమస్య ఉండదు. సాధారణంగా మధుమేహం ఉన్న వాళ్ళకు ఏ రకమైన వ్యాధైనా సులభంగా సోకే అవకాశం ఉంటుంది. కాని రక్తంలో షుగర్ స్థాయిని అదుపులో ఉంచుకుంటే జీవితకాల మంతా ఆరోగ్యంగా ఉండొచ్చు. అంటే బి.పి.ని, చక్కెర స్థాయిని అదుపులో ఉంచుకోవడం వల్ల సామాన్యంగా ఆరోగ్యపరంగాను, దాంపత్య జీవితంలోనూ ఎటువంటి సమస్యలు ఉండవు. అయితే మీకు పుట్టే సంతానానికి ఈ వ్యాధులు వచ్చే అవకాశం లేకపోలేదు. సాధారణంగా వ్యాధులు తల్లిదండ్రుల నుంచి పిల్లలకు వంశపారంపర్యంగా నేరుగా సోకవు. కాని వ్యాధి వచ్చే తత్వం మాత్రం తల్లిదండ్రుల నుంచి నేరుగా పిల్లల్లో ఉంటుంది. అయితే పుట్టిన వెంటనేగాని, చిన్న వయసులోగాని వెంటనే అవి కనబడవు. కేవలం రోగనిరోధక శక్తి క్షీణించినప్పుడు మాత్రమే బయటపడతాయి. కాబట్టి పిల్లల్లో రోగనిరోధక శక్తి క్షీణించకుండా జాగ్రత్తపడినంత కాలం ఏ వ్యాధులు సోకవు. అయితే పిల్లలు పెరిగి పెద్దవారు అయిన తర్వాత కూడా రోగనిరోధక శక్తిని పెంచుకుంటూ ఉన్నట్లైతే వారికి ఎటువంటి సమస్యలు ఉండవు.

ప్రస్తుతం మీరు చేయవలసిందల్లా మధుమేహం కంట్రోల్‌లో ఉండటం కోసం మందులు వాడాలి. మీ రోగనిరోధక శక్తిని పెంచుకున్నట్లైతే మీకు పుట్టే పిల్లలు ఆరోగ్యంగా రోగనిరోధక శక్తిని కలిగి ఉంటారు.



డాక్టర్ రాజశేఖర్,
ష్యూర్‌కేర్ హోమియోపతి

**రోగనిరోధక శక్తిని పెంచుకోవడమెలా?**

సమయానుసారంగా పోషక పదార్థాలు ఉన్న ఆహారం తీసుకోవడం, ఎక్కువ మంచినీరు తాగడం, యోగా, ప్రాణాయామం లేదా శరీరానికి సరిపడ వ్యాయామం క్రమం తప్పకుండా చేయాలి. పొగ తాగడం, మద్యపానం, గుట్కా వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. హోమియో మందులు వాడి, పరిసరాల శుభ్రతను పాటించాలి .

హోమియో వైద్య విధానంలో డయాబెటిస్, బి.పి. తగ్గడానికి చాలా మందులున్నాయి. కాని మీ విషయంలో కేవలం డయాబెటిస్ కోసమో, బి.పి కోసమో మందులు వాడటం వల్ల మీ వరకూ మాత్రమే ప్రయోజనం ఉంటుంది. కాని మీకు పుట్టబోయే పిల్లలకు కూడా ప్రయోజనకరంగా ఉండాలంటే మీరు, మీ భార్య ఇప్పుడు వాడుతున్న ఇంగ్లీషు మందులతో పాటుగా మంచి హోమియో వైద్యుని సంరక్షణలో సంప్రదాయ విధానం ద్వారా హోమియో మందులను వాడటం మంచిది. ఇలా వాడటం వల్ల మీరు ప్రస్తుతం వాడుతున్న ఇంగ్లీషు మందుల డోసును కూడా క్రమంగా తగ్గించవచ్చు. మీ లక్షణాలను బట్టి తాత్కాలిక ఉపశమనం కోసం సిజీజియమ్ జంబోలనమ్ అనే మందు మదర్‌టించర్‌ను రోజుకు రెండుసార్లు 10-15చుక్కలు వేడి నీటిలో వేసుకుని తాగాలి.

మీ సాధారణ ఆరోగ్య సమస్యలకు హోమియో చికిత్సా విధానంలో సలహాల కోసం రాయండి:
మా చిరునామా: హోమియో కౌన్సెలింగ్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి తెలుగు దినపత్రిక, 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నంబర్-1, బంజారాహిల్స్, హైదరాబాద్-500 034.
ఇ-మెయిల్: health@sakshi.com